# సాక్షి
## భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 29 । సెప్టెంబర్ । 2023






### అలరించే చుక్కల దుప్పులు
కిన్నెరసానిలో 49 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన డీర్ పార్క్‌లో చుక్కల దుప్పులు సందడి చేస్తూ పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. 8లో



### బాధితులకు భరోసా..
కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రిలోని పాలియేటివ్ సేవా కేంద్రం ద్వారా దీర్ఘకాలిక రోగులకు ఇంటి వద్దనే వైద్యం అందిస్తున్నారు. 8లో

### వాతావరణం
గరిష్టం / కనిష్టం
32° / 25°

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

**భద్రాచలం:** భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కాగా గణేష్ నిమజ్జనం సందర్భంగా వచ్చిన భక్తులతో రామాలయం సందడిగా మారింది.

### పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన
**పాల్వంచరూరల్ :** మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం మంత్రపుష్పం, నివేదన, హారతి సమర్పించారు. కార్యక్రమంలో వేద పండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్ శర్మ, ఈఓ ఎస్.రజినికుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, సభ్యులు గంధం వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

### సకాలంలో క్రషింగ్ చేపట్టాలి



మేనేజర్‌తో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

**అశ్వారావుపేటరూరల్:** అశ్వారావుపేట, దమ్మపేట మండలం అప్పారావుపేటలోని ఫ్యాక్టరీల్లో పామాయిల్ గెలలు కుళ్లిపోకుండా సకాలంలో క్రషింగ్ చేపట్టాలని ఆయిల్‌పామ్ అడ్వైజరీ కమిటీ సభ్యులు రావు జోగేశ్వరరావు అన్నారు. రైతు సంఘం నాయకులతో కలిసి రెండు ఫ్యాక్టరీలనూ గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గెలలు దెబ్బతినక ముందే అవసరమైతే అప్పారావుపేట ఫ్యాక్టరీకి తరలించి క్రషింగ్ చేపట్టాలని ఫ్యాక్టరీ మేనేజర్లు బాలకృష్ణ, కల్యాణ్‌లను కోరారు. గెలలు కుళ్లిపోతే ఓఈఆర్ దెబ్బతిని, ఎఫ్ఎఫ్ఏ పెరిగి రైతులు నష్టపోతారని అన్నారు. గెలల నాణ్యత పెంచేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తుంబూరు మహేశ్వర్‌రెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య, చెలికాని సూరిబాబు, శ్రీనివాస్ రెడ్డి, బత్తిని తిరుపతి, బి.ప్రసాద్ పాల్గొన్నారు.

### ఓటర్ల జాబితా సిద్ధం
**ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్**



పీఓ ప్రతీక్ జైన్

**బూర్గంపాడు:** అసెంబ్లీ ఎన్నికలకు పినపాక నియోజకవర్గ ఓటర్ల జాబితా సిద్ధం చేసినట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ తెలిపారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల తహసీల్దార్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశానుసారం ఓటర్ లిస్ట్ ప్రక్రియ పూర్తిచేశామని చెప్పారు. అన్ని పోలింగ్ స్టేషన్లలో ఆరు, ఏడు, ఎనిమిది ఫారాలకు సంబంధించిన పనులు పూర్తి చేశామన్నారు. పోలింగ్ స్టేషన్ల మార్పులు, దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశామని తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాఘవరెడ్డి, ఎన్నికల సహాయకుడు రామ్‌నాయక్ పాల్గొన్నారు.

### రేపు ఈటల పర్యటన
**ఇల్లెందు:** ఇల్లెందు నియోజకవర్గ పరిధిలోని టేకులపల్లి మండలంలో ఈనెల 30న హుజూరాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ పర్యటించనున్నారు. ఈ మేరకు పార్టీ జిల్లా సమన్వయకర్త నాళ్ల సోముసుందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు హాజరై పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

# గంగమ్మ చెంతకు గణనాథుడు



భద్రాచలం వద్ద గోదావరిలో నిమజ్జనానికి తీసుకొచ్చిన వినాయక విగ్రహాలు



అశ్వారావుపేటరూరల్: శోభాయాత్రలో నృత్యం చేస్తున్న భక్తులు

### జిల్లాలో ఘనంగా వినాయక నిమజ్జనం
- కొత్తగూడెంలో భారీ శోభాయాత్ర
- భద్రాచలం గోదావరి తీరాన భక్తుల సందడి

**భద్రాచలంఅర్బన్/కొత్తగూడెంటౌన్ :** జిల్లాలో వినాయక నిమజ్జన వేడుకలు గురువారం కోలాహలంగా సాగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో భద్రాచలం గోదావరి తీరం సందడిగా మారింది. 10 రోజుల పాటు విశేష పూజలు అందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భద్రాచలానికి 600కు పైగా విగ్రహాలు నిమజ్జనానికి తరలివచ్చాయి. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో సాయంత్రం 5.30 గంటలకు స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు శోభాయాత్రను ప్రారంభించారు. ఊరేగింపుగా వెళుతున్న వాహనాల్లోని గణనాథులకు ఎమ్మెల్యేతో పాటు కొత్తగూడెం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్‌లు ప్రత్యేక పూజలు చేశారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కొత్తగూడెం త్రీటౌన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఉత్సవ సమితి వేదిక వద్ద కూడా ప్రత్యేక పూజలు చేశారు. శోభాయాత్రలో భక్తులు నృత్యాలు చేస్తూ 'జై గణేశ్' నినాదాలు చేయగా పట్టణమంతా మార్మోగింది. చంద్రుగొండ, పెనగడప, రుద్రంపూర్, గౌతంపూర్, త్రీఇంక్‌లైన్, రామవరం, విద్యానగర్ కాలనీ, పాత కొత్తగూడెం ఏరియాలకు చెందిన విగ్రహాలు కొత్తగూడెం మీదుగా భద్రాచలం గోదావరి నదికి నిమజ్జనానికి తరలివెళ్లాయి. శోభాయాత్ర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసు అధికారులు, సిబ్బంది భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. శోభాయాత్రలో టీపీసీసీ సభ్యులు ఎడవల్లి కృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝర్రా కామేష్ తదితరులు పాల్గొన్నారు.



బొజ్జగణపయ్యతో చిన్నారి



గోదావరి ఒడ్డు నుంచి క్రేన్ ద్వారా నదిలోకి తరలిస్తున్న విగ్రహాలు

### భద్రాద్రిలో భారీ విగ్రహాల నిమజ్జనానికి ఇక్కట్లు
గోదావరి తీరానికి నిమజ్జనానికి వచ్చిన వాటిలో 13 అడుగుల బారీ విగ్రహం కూడా ఉంది. విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు భక్తులు అధికారులకు అప్పగించారు. క్రేన్ ద్వారా విగ్రహాన్ని తరలించి బోటుపై పెట్టే క్రమంలో సిబ్బంది బరువును ఆపలేకపోవడంతో ఒక వైపునకు ఒరుగుతూ గోదావరిలోకి జారిపోయింది. ఆ విగ్రహాన్ని తిరిగి బోటుకు కట్టేందుకు సిబ్బంది ప్రయత్నిస్తుండగా మధ్యలోకి విరిగింది. చివరకు సిబ్బంది ఎంతో ఇబ్బంది పడి నిమజ్జనాన్ని పూర్తి చేశారు.



కొత్తగూడెం సూపర్‌బజార్ సెంటర్‌లో గణపతికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వనమా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని తదితరులు

# గెలుపు గుర్రాలెక్కడ !?

### కాంగ్రెస్ జాబితా ప్రకటనపై ఉత్కంఠ
- టికెట్ కోసం ఆశావహుల ప్రయత్నాలు
- తెరపైకి కొత్తగా బీసీ, లంబాడీల డిమాండ్
- క్షేత్రస్థాయిలో వివరాల సేకరణకు అధిష్టానం ఫ్లాష్ సర్వే



**సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం:** రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు గుర్రాలను పట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా శ్రమిస్తోంది. గతానికి భిన్నంగా ఈసారి పోటీ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలంటూ నిబంధన విధించింది. దరఖాస్తు జాబితా నుంచి తొలిదశలో రాష్ట్రస్థాయిలో వడపోత చేపట్టారు. ఇందులో నియోజకవర్గానికి సగటున మూడు చొప్పున పేర్లతో ఏఐసీసీ పరిశీలనకు పంపారు. అక్టోబర్ 15 వరకు టికెట్ల ప్రకటన ఉంటుందని తెలుస్తోంది. దీంతో ఏఐసీసీ పరిశీలనకు వెళ్లిన మూడింటిలో తమ పేరు కూడా ఉందనే నమ్మకం గల నాయకులు ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్‌కు శ్రీకారం చుట్టారు. వారంతా ఇప్పటికే దేశ రాజధానికి రాకపోకలు సాగిస్తున్నారు. అభ్యర్థుల ప్రయత్నాలు ఇలా ఉంటే మరోవైపు కాంగ్రెస్ అధిష్టానం క్షేత్రస్థాయిలో ఆశావహుల బలాబలాలు తెలుసుకునేందుకు తాజాగా ఫ్లాష్ సర్వే నిర్వహిస్తోంది.

**పలు కోణాల్లో రహస్య సర్వే..**

కాంగ్రెస్ అధిష్టానం చేపట్టిన రహస్య సర్వేలో.. గత నాలుగేళ్లుగా ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎలా ఉంది, పార్టీ బలోపేతానికి టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులు చేపట్టిన కార్యక్రమాలు ఏంటి, పార్టీ వాణిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లారా, నియోజకవర్గ ఓటర్లు వారిని గుర్తు పట్టగలరా, టికెట్ ఇస్తే ఎన్నికల ఖర్చు భరించేగలిగే ఆర్థిక స్థోమత ఉందా, ఆయా అభ్యర్థులకు పార్టీ పరంగా ఎలాంటి మద్దతు ఇవ్వాల్సి ఉంటుంది, గతంలో ఎన్ని సార్లు పోటీ చేశారు, అభ్యర్థి వయసు తదితర అంశాలపై వివరాలను సేకరిస్తున్నారు. గత బుధవారం మొదలైన సర్వే శనివారం వరకు కొనసాగుతుందని పార్టీ వర్గాలు అంటున్నాయి. క్షేత్రస్థాయిలో పార్టీ అధిష్టానం తరఫున సర్వే జరుగుతున్నట్టు తేలడంతో నాయకుల్లో టెన్షన్ మొదలైంది. దీంతో సర్వే చేస్తున్న బృందం తారసపడితే తమకు అనుకూలంగా అభిప్రాయం చెప్పాలంటూ తమ మద్దతుదారులను ఆశావహులు కోరుతున్నారు.

**భారీగా దరఖాస్తులు..**

టికెట్ కోసం నియోజకవర్గాల వారీగా వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తే పినపాక నుంచి 17 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో పాయం వెంకటేశ్వర్లు, పోలేబోయిన శ్రీవాణి, చందా సంతోశ్, విజయ్‌గాంధీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇల్లెందు నియోజకవర్గానికి రాష్ట్రంలోనే అత్యధికంగా 32 దరఖాస్తులు రావడం ఏఐసీసీ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. అయితే ఇక్కడ జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్యకు సానుకూల వాతావరణం ఉంది. కానీ ఇక్కడ లంబాడీలకే టికెట్ కేటాయించాలంటూ ప్రవీణ్‌నాయక్, అజ్మీరా శంకర్‌నాయక్, గుగులోత్ రవి బలంగా కోరుతున్నారు. గత నాలుగేళ్లుగా పార్టీ కోసం చేపట్టిన కార్యక్రమాలే తమకు టికెట్ అందిస్తాయనే ధీమా ఈ నేతల్లో ఉంది. జిల్లాలో ఏకైక జనరల్ స్థానమైన కొత్తగూడెం నుంచి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఊకంటి గోపాల్‌రావు, లక్కినేని సురేందర్, ఎడవల్లి కృష్ణ, నాగాసీతారాములు, పోట్ల నాగేశ్వరరావుతో పాటు మొత్తం 10 మంది టికెట్ ఆశిస్తున్నారు. పొంగులేటి ఇతర నియోజకవర్గానికి వెళితే ఇక్కడ బీసీలకు అవకాశం ఇవ్వాలనే వాదన వస్తోంది. అశ్వారావుపేట నుంచి జారే ఆదినారాయణ, సున్నం నాగమణి, తాటి వెంకటేశ్వర్లుతో పాటు మొత్తం ఎనిమిది మంది టికెట్ ఆశిస్తున్నారు.

**భారీగా ఆశావహులు..**

జిల్లాలో భద్రాచలం మినహా మిగిలిన నాలుగు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్న అభ్యర్థుల జాబితా ఎక్కువగా ఉంది. ఇందులో ముగ్గురి చొప్పున జాబితాను ఇప్పటికే సిద్ధం చేశారు. అయితే ఇటీవల కొత్తగూడెం సీటు బీసీలకు, ఇల్లెందు సీటును లంబాడీ సామాజిక వర్గానికి కేటాయించాలనే డిమాండ్ ఊపందుకుంది. మరోవైపు మహిళా బిల్లు ఆమోదం పొందడంతో ఒక సీటు మహిళలకు కేటాయించాలనే వాదన పార్టీ నుంచి వస్తోంది. దీంతో నియోజకవర్గాల వారీగా డేటా సేకరించేందుకు నలుగురు సభ్యులతో కూడిన బృందాలను రాష్ట్రంలో టికెట్ల కోసం పోటీ ఎక్కువగా ఉన్న నియోజకవర్గాలకు పంపింది. ఒక్కో నియోజకవర్గానికి నలుగురు వంతున సభ్యులతో కూడిన ఫ్లాష్ సర్వే సభ్యులు బుధవారం నుంచి క్షేత్రస్థాయిలో తమ పని ప్రారంభించారు.

# రేపు ఖమ్మానికి కేటీఆర్

**సాక్షిప్రతినిధి, ఖమ్మం:** రాష్ట్ర ఐ.టీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ శనివారం ఖమ్మం రానున్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి ఆయన ఖమ్మంలో రూ.1,362.35 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. ప్రధానంగా మున్నేరుపై ఆర్‌సీసీ రిటైనింగ్ వాల్, సస్పెన్షన్ బ్రిడ్జితోపాటు అమృత్ 2.0 పథకం కింద అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

**ఆర్‌సీసీ వాల్.. సస్పెన్షన్ బ్రిడ్జి..**

ఈ ఏడాది జూలైలో మున్నేరుకు వరద పోటెత్తింది. దీంతో పరివాహక ప్రాంతంలోని ఇళ్లన్నీ నీట మునిగాయి. అయితే, భవిష్యత్‌లో మున్నేరుకు ఇదే రీతిలో వరద వస్తే మరింత నష్టం వాటిల్లే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా మున్నేరుకు ఇరువైపులా ఆర్‌సీసీ వాల్ నిర్మాణానికి రూ.690.52 కోట్ల నిధులు విడుదల చేశారు. అలాగే, మున్నేరుపై తీగల వంతెన నిర్మాణానికి ఈ ఏడాది జనవరిలోనే సీఎం హామీ ఇవ్వగా నిధులు కేటాయిస్తూ జీఓ విడుదలైంది. దీంతో రూ.180 కోట్లతో నిర్మించే సస్పెన్షన్ బ్రిడ్జితో పాటు ఆర్‌సీసీ రిటైనింగ్ వాల్ పనులకు మంత్రులు కేటీఆర్, అజయ్ శనివారం శంకుస్థాపన చేయనున్నారు.

**మంత్రుల పర్యటన షెడ్యూల్ ఇలా..**


శనివారం ఉదయం 9.30 గంటలకు మున్నేరుపై ఆర్‌సీసీ రిటైనింగ్ వాల్ పనులకు, ఆ తర్వాత సస్పెన్షన్ బ్రిడ్జికి మంత్రులు కేటీఆర్, అజయ్ శంకుస్థాపన చేస్తారు. అనంతరం రూ.108.71 కోట్లతో నిర్మించిన గోళ్లపాడు చానల్, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, 20వ డివిజన్‌లో రూ.71 లక్షలతో నిర్మించిన టర్ఫ్ కోర్టు, రూ.1.37 కోట్లతో లకారం వద్ద నిర్మించిన ఎన్టీఆర్ పార్క్‌ను ప్రారంభిస్తారు. అలాగే రూ.10 కోట్లతో నిర్మించే లకారం అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, అమృత్ 2.0 కింద రూ.249.50 కోట్లతో నిర్మించే అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులకు లకారం వద్ద శంకుస్థాపన చేయనున్నారు.

# డీసీసీబీలో 14 మందికి ఉద్యోగోన్నతి

- ముగ్గురికి మేనేజర్లుగా, 11 మందికి అసిస్టెంట్ మేనేజర్లుగా అవకాశం
- రెండు, మూడు రోజుల్లో పోస్టింగ్

**ఖమ్మంవ్యవసాయం:** జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ)లో 14 మంది ఉద్యోగులకు పదోన్నతి లభించింది. ఇందులో ముగ్గురికి మేనేజర్లుగా, 11 మందికి అసిస్టెంట్ మేనేజర్లుగా పదోన్నతి కల్పించారు. వీరికి రెండు, మూడు రోజుల్లో పోస్టింగ్ ఇచ్చే అవకాశముంది. బ్యాంకులో ఒక అసిస్టెంట్ జనరల్ మేనేజర్(ఏజీఎం), ముగ్గురు మేనేజర్లు, 14 మంది అసిస్టెంట్ మేనేజర్లుగా మొత్తం 18 మందికి ఇన్ సరీ్వస్ కేటగిరీ ద్వారా పదోన్నతి కల్పించాలని పాలకవర్గం నిర్ణయించగా.. నిబంధనలు, అర్హతల ఆధారంగా 14 మందికి అవకాశం లభించింది. తొలుత రాతపరీక్షను ముంబైలోని ఐబీపీఎస్(ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంక్ పర్సనల్ సెలక్షన్) ద్వారా ఈ నెల 10వ తేదీన నిర్వహించారు. ఇక డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం అధ్యక్షుడిగా, టస్కాబ్ అధికారి వివేక్, డీసీసీబీ సీఈఓ అట్లూరి వీరబాబు, డైరెక్టర్ పునుకొల్లు రాంబ్రహ్మం సభ్యులుగా కమిటీని నియమించి రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా ఒక్కో పోస్టుకు ఐదుగురు చొప్పున ఉద్యోగులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ మేరకు అసిస్టెంట్ మేనేజర్లుగా పనిచేస్తున్న ఇందు, సతీశ్, మమతకు మేనేజర్లుగా, స్టాఫ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న రేష్మ, శరత్ చంద్రిక, నిరీష, చరిష్మా, శిరీష, కృష్ణవేణి, సునీల, బాలకృష్ణ, ఉదయ్, ప్రార్థన విజయ, సుధాకర్‌కు అసిస్టెంట్ మేనేజర్లుగా పదోన్నతి లభించింది. ఇక ఎస్టీ కేటగిరీలో మూడు పోస్టులు ఉన్నా అర్హులు లేకపోవడంతో పక్కన పెట్టారు. అలాగే, అసిస్టెంట్ జనరల్ మేనేజర్(ఏజీఎం)గా పదోన్నతి రాష్ట్ర బ్యాంకు(టస్కాబ్) ఆధ్వర్యాన కల్పించాల్సి ఉంది.


# రూ. కోటితో ముక్కోటి పనులు



విద్యుత్ దీప కాంతులతో రామాలయం(ఫైల్)

**భద్రాచలం:** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈ ఏడాది జరగనున్న ముక్కోటి ఏకాదశి పనులకు అధికారులు రూ.కోటి వ్యయంతో పనులు చేపట్టాలని నిర్ణయించారు. డిసెంబర్ 22న సాయంత్రం పవిత్ర గోదావరిలో తెప్పోత్సవం, 23న తెల్లవారుజామున ఉత్తర ద్వారా దర్శనం ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ప్రధాన ఆలయం, పర్ణశాల ఆలయానికి రంగులు వేసేందుకు సుమారు రూ.15.50లక్షలు, కరకట్ట, గోశాల, వైకుంఠ ద్వారం వద్ద రంగులకు రూ.9 లక్షలు, భద్రాచలం, పర్ణశాలలో తాత్కాలిక వసతి కోసం రూ.5 లక్షలు కేటాయించారు. షామియానాలు, కార్పెట్‌లకు రూ. 5.50 లక్షలు, ఎల్ఈడీలకు రూ.4 లక్షలు, క్లాత్ డెకరేషన్, ఆర్చ్‌లకు రూ.7 లక్షలు, హంస వాహనానికి రూ. 4లక్షల నిధులు వెచ్చించనున్నారు. ఇక బాణసంచాకు రూ.6 లక్షలు, పూల అలంకరణకు రూ. 8 లక్షలు, ఇతర పనులకు మిగతా సొమ్ము కేటాయించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆయా పనులకు ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలవనున్నారు. టెండర్ల అనంతరం అక్టోబర్ నుంచి అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

### రామయ్యను దర్శించుకున్న ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్



ఆలయ ప్రాంగణంలో కుటుంబ సభ్యులతో కొమ్మినేని

**దుమ్ముగూడెం :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి వారిని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో గురువారం దర్శించుకున్నారు. అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం కొమ్మినేని పంచవటీ కుటీరం, నార చీరల ప్రాంతాలను సందర్శించి వాటి విశిష్టత గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ ఆదినారాయణ, లక్ష్మయ్య ఉన్నారు.

# గణపతి లడ్డూ @ రూ.2లక్షలు

**అశ్వారావుపేటరూరల్:** అశ్వారావుపేట ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లోని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మండపంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన 35 కేజీల లడ్డూను గురువారం వేలం వేశారు. అశ్వారావుపేటకు చెందిన సెల్‌షాపు వ్యాపారి చీమకుర్తి జితేంద్ర, అతడి మిత్రులు కలిసి రూ.2,05,116 వేలంలో లడ్డూను దక్కించుకున్నారు. ఈ నగదతోపాటు మరో రూ.లక్ష కలిపి స్వామి వారికి వెండి మకర తోరణం చేయిస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. గత 20 ఏళ్లలో స్వామివారి లడ్డూకు అధిక ధర రావడం ఇదే తొలిసారి.

**సుభాష్‌నగర్ రామాలయంలో రూ.1.25 లక్షలు..**

**ఇల్లెందురూరల్:** గణపతి నవరాత్రుల సందర్భంగా భక్తులు లడ్డూ, కలశం వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఇల్లెందు సుభాష్‌నగర్ రామాలయంలో లడ్డూను రూ.1.25 లక్షలకు రాంచందర్, అతడి మిత్రులు తీసుకున్నారు.



లడ్డూ అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

**ఇల్లెందులో రూ.55 వేలు..**

**ఇల్లెందు:** పట్టణంలోని స్టేషన్ బస్తీలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామివారి సన్నిధిలో ఏర్పాటు చేసిన లడ్డూను గురువారం వేలం వేయగా పూజారి హరగోపాల్ శర్మ రూ.55 వేలకు లడ్డూ కైవసం చేసుకున్నారు.

# అలరించే చుక్కల దుప్పులు

## కిన్నెరసానిలో జింకల సందడికి 49 ఏళ్లు

- ప్రస్తుతం డీర్ పార్కులో 130 జింకలు
- ప్రత్యేకాకర్షణగా మూషిక జింకలు, కొండగొర్రెలు
- కొనసాగుతున్న పార్కు విస్తీర్ణం పెంపు పనులు




డీర్ పార్కులోని చుక్కల దుప్పులు, (ఇన్‌సెట్) ప్రారంభంనాటి శిలాఫలకం

**పాల్వంచరూరల్:** పర్యాటక ప్రదేశమైన కిన్నెరసానిలో రాష్ట్ర జంతువైన జింకల సందడి ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. శరీరం మీద తెల్లటి చుక్కలతోపాటు, కొమ్ములు కలిగి ఉండి చెంగు చెంగున గంతులేస్తూ కన్పిస్తుంటాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన డీర్ పార్కు పర్యాటకులకు ఆహ్లాదం పంచడంతోపాటు జింకల సంతానోత్పత్తికి నెలవుగా మారింది.

**1974లో డీర్ పార్కు ఏర్పాటు..**

వన్యప్రాణుల సంరక్షణ విభాగం పర్యవేక్షణలో పర్యాటకులను కనువిందుచేసే అరుదైన కృష్ణ చుక్కల దుప్పుల(జింకలు) ఆవాసం.. డీర్‌పార్కు ఏర్పాటు చేసి 49 సంవత్సరాలు అవుతోంది. పాల్వంచకు 12 కిలోమీటర్ల దూరంలోని కిన్నెరసానిలో సింగరేణి సంస్థ డీర్ పార్కును ఏర్పాటు చేసింది. అప్పుడు మూడు జింకలను వదిలారు. వాటి సంరక్షణకు 14 హెక్టార్ల విస్తీర్ణంలో పార్కు నిర్మించగా, 1974 సెప్టెంబర్ 29న నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ప్రారంభించారు. 1998 వరకు జింకల సంరక్షణ బాధ్యతను చూసిన సింగరేణి సంస్థ, తర్వాత ఆ బాధ్యతను అటవీశాఖ పరిధిలోని వైల్డ్‌లైఫ్ విభాగానికి అప్పగించింది.

**ప్రస్తుతం 130 జింకలు**

అటవీశాఖకు అప్పగించాక పార్కును అభివృద్ధి చేశారు. 2012 సంవత్సరంలో రూ.11 లక్షల ఇనుప కంచె నిర్మించారు. నాడు పార్కులో మూడు జింకలు వదలగా నేడు అవి 130కు చేరుకున్నాయి. వీటికి తోడు మరో ఐదు మూషిక జింకలు, కొండగొర్రెలు ఉన్నాయి. జింకలకు పోష్టికాహారం కోసం ప్రత్యేకంగా రెండు హెక్టార్లలో గడ్డి పెంచుతున్నారు. ఉదయం 50 కేజీలు, సాయంత్రం 50 కేజీల దాణాతోపాటు గడ్డి 250 కేజీల చొప్పున జింకలకు మేతగా వేస్తున్నారు. జింక ఏడాదికోసారి ఒకటి లేదా రెండు పిల్లలకు జన్మనిస్తుందని డీర్ పార్కు రేంజర్ శ్రీనివాసరావు తెలిపారు. కాగా మొక్కజొన్న పొట్టు, పెసర పొట్టు, ధాన్యం, చిరు ధాన్యాలు తదితరాలు కలిపి దాణాగా అందిస్తారు.

**అరకొర నిధులే..**

డీర్ పార్కులో జింకల సంరక్షణకు ప్రభుత్వం అరకొరగానే నిధులు ఇస్తుందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పార్కు విస్తీర్ణం తక్కువగా ఉండటంతో జింకల మేత దొరకడం లేదని, అటవీశాఖ అధికారులు పెంచే గడ్డి, కాంట్రాక్టర్ ఇచ్చే దాణా మాత్రమే తినాల్సి వస్తోందని జంతుప్రేమికులు పేర్కొంటున్నారు. 130 జింకలకు అధికారులు ఇచ్చే దాణా సరిపోవడం లేదని, అందుకే పర్యాటకులు తెచ్చే ఆహారం కోసం ఎదురుచూస్తూ ఉంటాయని చెబుతున్నారు.

### పెరగనున్న పార్కు విస్తీర్ణం



కిన్నెరసానిలోని డీర్ పార్కు

జింకల సంరక్షణ, ఆహార లభ్యత కోసం డీరు పార్కును విస్తరించాలని అటవీశాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. పార్కు విస్తీర్ణాన్ని మరో 6,5 కిలోమీటర్లు పొడిగించే పనులు చేపట్టారు. రూ.1.25 కోట్లతో చైన్‌లింక్ కంచె కూడా నిర్మాణం కూడా చేపట్టారు. కంచె నిర్మాణ పనులు పూర్తయితే పార్కు విస్తీర్ణం దాదాపుగా 200 ఎకరాలకు చేరుకుంటుందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది నుంచి పార్కులో జింకలు గుంపులు, గుంపులుగా కన్పించకపోవచ్చు. అయితే పార్కులో ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసి, పర్యాటకులు వీక్షించేలా చర్యలు తీసుకుంటామని వైల్డ్‌లైఫ్ అధికారులు పేర్కొంటున్నారు.

### ఇనుప కంచె నిర్మిస్తున్నాం



డీర్ పార్కు విస్తరణ పనులు చేపట్టాం. సంరక్షణకు ప్రత్యేకంగా ఇనుప కంచె కూడా నిర్మిస్తున్నాం. జింకలకు రోజూ రెండు పూటలా పోష్టికాహారం అందిస్తున్నాం. పార్కులో చెక్ డ్యామ్‌లు నిర్మించాం. వీటి ద్వారా ఏడాదంతా జింకలకు తాగునీరు అందుబాటులో ఉంటుంది. వన్యప్రాణుల రక్షణకు రాత్రి, పగలు సిబ్బంది పహారా కాస్తున్నారు.

–కట్టా దామోదర్‌రెడ్డి, వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ

# దీర్ఘకాలిక రోగులకు భరోసా..

పాలియేటివ్ కేంద్రం ద్వారా బాధితుల ఇళ్ల వద్దే వైద్య సేవలు



అశ్వాపురం మండలం మొండికుంటలో బాధితులకు వైద్య సేవలందిస్తున్న డాక్టర్, సిబ్బంది

**అశ్వాపురం:** కొత్తగూడెంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన పాలియేటివ్ సేవా కేంద్రం ద్వారా దీర్ఘకాలిక రోగులకు ఇంటి వద్దనే వైద్య సేవలు అందిస్తున్నారు. జాతీయ ఆరోగ్య మిషన్, వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ పర్యవేక్షణలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో తెలంగాణ పాలియేటివ్ కేర్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీల సిబ్బంది సహాయంతో వైద్యురాలు, ఫిజియోథెరపిస్ట్, సిబ్బంది గ్రామాలను సందర్శించి రోగులకు వైద్య సేవలు, మందులు అందిస్తున్నారు. రోగుల కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ కూడా ఇస్తున్నారు. ఆరోగ్య సమస్య తీవ్రంగా ఉంటే రోగులను వాహనంలో పాలియేటివ్ కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు. ఈ కేంద్రం ద్వారా జిల్లాలో 1,200 మంది దీర్ఘకాలిక రోగులను గుర్తించారు. వీరిలో 350 మందికి పైగా కేన్సర్ బాధితులు ఉన్నారు. వారందరికీ సేవలందిస్తున్నారు. పాలియేటివ్ కేంద్రంలో ఒక డాక్టర్, ఫిజియోథెరపిస్ట్, నలుగురు స్టాఫ్ నర్సులు, ముగ్గురు ఆయాలు, వాహనం, డ్రైవర్ అందుబాటులో ఉంచారు. జిల్లా కేంద్రంలో 8 పడకలతో వార్డు, ఫిజియోథెరపీ పరికరాలు ఏర్పాటు చేసి, సేవలందిస్తున్నారు.

### రోజుకో గ్రామాన్ని సందర్శిస్తాం



కొత్తగూడెంలోని పాలియేటివ్ సేవా కేంద్రం ద్వారా దీర్ఘకాలిక రోగులకు వైద్య సేవలు అందిస్తాం. జిల్లాలోని 28 పీహెచ్‌సీల సిబ్బంది సహకారంతో రోజుకో ఓ గ్రామాన్ని సందర్శించి రోగుల ఇంటి వద్దకు వెళ్లి వైద్య సేవలందించడంతోపాటు కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తాం. కేంద్రంలో ఫిజియోథెరపి సేవలు కూడా అందిస్తాం.

–డాక్టర్ రూప, పాలియేటివ్ కేర్ వైద్యాధికారి

### తాటిచెట్టుపై పిడుగు..



తాటిచెట్టుపై చెలరేగుతున్న మంటలు

**అశ్వాపురం:** మండల కేంద్రమైన అశ్వాపురం గ్రామ శివారులో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ పక్కన తాటి చెట్టుపై గురువారం రాత్రి పిడుగు పడింది. మంటలు చెలరేగడంతో స్థానికులు, బంక్ నిర్వాహకులు, సిబ్బంది, వినియోగదారులు భయాందోళన చెందారు. అయితే ఎలాంటి ప్రమాదమూ జరగలేదు.

# రూ.10లక్షల విలువైన గంజాయి స్వాధీనం

**ఖమ్మంరూరల్:** ముదిగొండ మండలంలోని చెక్ పోస్ట్ వద్ద చేపట్టిన తనిఖీల్లో రూ.10 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి తెలిపారు. ఖమ్మం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. ముదిగొండ మండలం వల్లభి వద్ద ఏర్పాటు చేసిన రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులో బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ కారు అనుమానాస్పదంగా కనిపించడంతో ఆపగా అందులోని ఇద్దరు పారిపోయేందుకు యత్నించారు. దీంతో వారిని పట్టుకుని కారును సోదా చేయగా 44.825 కేజీల ఎండు గంజాయి లభించింది. ఒడిశాలో కొనుగోలు చేసిన గంజాయిని ఎక్కువ ధరకు అమ్ముకునేందుకు గాను కారులో వరంగల్ జిల్లాకు తరలిస్తున్నట్లు తేలిందని ఏసీపీ తెలిపారు. ఒడిశా రాష్ట్రం చింతకుంట మండలం రోస్యగూడకు చెందిన వంత బలరామ్, ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా పాలగడ్డకు చెందిన కులదీప్‌కిశోర్‌ను అదుపులోకి తీసుకుని ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. వారి నుంచి కారు, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐ రాజిరెడ్డి, ముదిగొండ ఎస్‌ఐ జి.నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆస్పత్రి సిబ్బందిపై దాడి: ఇద్దరికి గాయాలు

**కొత్తగూడెంరూరల్:** జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్న సిబ్బందిపై కొందరు వ్యక్తులు గురువారం దాడి చేశారు. పట్టణంలోని రామవరం టాకీస్ ఏరియాకు చెందిన కొందరు వ్యక్తులు వారికి సంబంధించిన ఓ మహిళను ఆస్పత్రిలో చేర్పించారు. ఆమెకు వైద్య సేవలు అందిస్తుండగా, వైద్య సిబ్బందితో ఘర్షణకు దిగి, అక్కడే ఉన్న కుర్చీతో దాడి చేశారు. దీంతో ఆస్పత్రి సిబ్బంది స్వాతితోపాటు మరొకరు గాయపడ్డారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ కుమార్‌స్వామి సూచనలతో సిబ్బంది త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# శాస్త్రీయ యాజమాన్యంతో అధిక దిగుబడులు



నారాయణపురంలో వరి చేనును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

**అశ్వారావుపేటరూరల్:** రైతులు శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా సుస్థిర దిగుబడులు సాధించొచ్చని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ తెలిపారు. వ్యవసాయ కళాశాల దత్తత గ్రామమైన మండలంలోని నారాయణపురంలో గురువారం శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా వరి, ఆయిల్‌పామ్, పత్తి, మినుము పంటలను సందర్శించిన వారు తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. వరిలో కాండం తొలిచే పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు ఎకరానికి 8 కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పీ 2 గ్రాములను లీటర్ నీటికి చొప్పున లేదా క్లోరంట్రా నిలిప్రోలు 0.3 మి.లీ.ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. అలాగే, ఆయిల్‌పామ్ తోటల్లో కొమ్ము పురుగు నివారణకు పశువుల ఎరువు వేసే ముందు టన్నుకు 200 గ్రాములు కార్బరిల్ పొడి మందు కలపాలని సూచించారు.

దీంతోపాటు రంధ్రాలు కలిగిన చిన్న పాలిథిన్ కవర్‌లో 20 గ్రాముల చొప్పున పోరేట్ గుళికలు వేసి చెట్ల మువ్వల్లో ఉంచడం ద్వారా వచ్చే వాసనకు పురుగులు వెళ్లిపోతాయని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ కె.గోపాలకృష్ణమూర్తి, డాక్టర్ కె.నాగాంజలి, డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ టి.పావని, సొసైటీ చైర్మన్ నిర్మల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరిలో బాలుడు గల్లంతు

మరో ఇద్దరిని కాపాడిన ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది, గజ ఈతగాళ్లు



గల్లంతైన గణేష్ తేజ (ఫైల్)



మరో బాలుడిని కాపాడి బోటులో ప్రథమ చికిత్స చేస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది

**భద్రాచలం అర్బన్/టేకులపల్లి:** గోదావరిలో స్నానానికి వెళ్లి బాలుడు గల్లంతైన సంఘటన భద్రాచలంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. టేకులపల్లి మండలం ఈర్యా తండాకు చెందిన లకావత్ గణేష్ తేజ (14), బానోత్ రామ్‌చరణ్, బానోత్ గణేష్ తదితరులు బంధుమిత్రులతో కలిసి భద్రాచలం వద్ద గోదావరిలో వినాయకుడిని నిమజ్జనం చేసేందుకు వచ్చారు. ఈ క్రమంలో బానోత్ రామ్‌చరణ్, బానోత్ గణేష్ ఇద్దరు స్నాన ఘట్టాల వద్ద ఆడుకుంటూ లోతు తెలియక గోదావరిలో మునకకు గురయ్యారు. ఆ సమయంలో పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు, పోలీసులు, ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్లు గోదావరిలోకి దూకి వారిద్దరినీ కాపాడారు. బానోత్ రామ్‌చరణ్ ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. అనంతరం ఇద్దరిని చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ఘటన జరిగాక లకావత్ గణేష్‌తేజ కనిపించడం లేదని బాలుడి కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది కలిసి గోదావరిలో సుమారు 2 కిలోమీటర్ల మేర గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ఆచూకీ లేదు. గణేష్‌తేజ ఆచూకీ కోసం అన్ని విధాల చర్యలు తీసుకోవాలని ఈర్యాతండా గ్రామస్తులు భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్‌ను కలిసి విన్నవించారు. తమ కొడుకుని కాపాడాలని తేజ తల్లిదండ్రులు లాకవత్ బాలాజీ, నీల కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. కాగా ప్రమాదం జరిగాక భద్రాచలం ఏఎస్పీ అప్రమత్తమై కరకట్ట వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. మరింత మంది పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. కాగా గణేష్ తేజ టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు.

# రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

**పెనుబల్లి:** వ్యాన్ వెనుక నుంచి ఢీకొట్టగా కారు అదుపుతప్పి ముందు వెళ్తున్న మరోకారును ఢీకొట్టడంతో ఏడుగురికి గాయాలయ్యాయి. పెనుబల్లి మండలం గౌరారం టోల్‌ప్లాజా సమీపాన గురువారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దేవతలగుట్ట వద్ద ఉన్న శివాలయంలో పూజలు చేసిన భక్తులు పలువురు చంద్రుగొండ మండలం తిప్పనపల్లి వైపు కారులో వెళ్తున్నారు. ఈ సమయాన పెనుబల్లి నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న సింగరేణి వ్యాన్ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో కారు అదుపుతప్పి ఎర్రగుంట నుంచి పెనుబల్లి వైపు వస్తున్న ఇంకో కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు కార్లు ధ్వంసం కాగా నలుగురు మహిళలతో పాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. వారిని పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, క్షతగాత్రుల్లో తిప్పనపల్లికి చెందిన రామిశెట్టి శ్రీను పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం తీసుకెళ్లారు. ప్రమాదానికి కారణమైన సింగరేణి వ్యాన్‌ను డ్రైవర్ ఆపకుండా వెళ్తుండడంతో స్థానికులు వెంబడించి చంద్రుగొండ పోలీసులకు అప్పగించారు. ఘటనా స్థలాన్ని వీఎం బంజర్ ఎస్‌ఐ జి.సూరజ్ పరిశీలించారు.

### బొలెరో వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

**గుండాల:** బొలెరో వాహనం ఢీకొని ఒకరు తీవ్రంగా గాయపడ్డ సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఆళ్లపల్లి మండలంలోని తిర్లాపురం గ్రామానికి చెందిన కుంజా నరేష్ ద్విచక్రవాహనంపై కాచనపల్లి వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో కాచనపల్లి నుంచి బొలెరో వాహనం ఆళ్లపల్లి వస్తోంది. కాగా అనంతోగు కాచనపల్లి మధ్యలో, రెండు వాహనాలు ఢీకొన్నాయి. దీంతో నరేష్‌కు తీవ్ర గాయాలుకాగా, చికిత్స నిమిత్తం కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు.

### లైంగిక దాడికి యత్నం

**అశ్వారావుపేటరూరల్:** వివాహితపై లైంగిక దాడికి యత్నించిన ఘటనలో గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై పి.శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత తన ఇంట్లో నిద్రిస్తుండగా బుధవారం రాత్రి సమయంలో ఇనుముల వీరన్న అనే వ్యక్తి లైంగిక దాడికి యత్నించాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


### జ్వరంతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

**దుమ్ముగూడెం :** మండలంలోని ములకపాడు గ్రామానికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సరోజిని (27) జ్వరంతో గురువారం అర్ధరాత్రి మృతిచెందింది. జ్వరంతో ఇబ్బంది పడుతూ నీరసంగా ఉండటంతో బుధవారం సాయంత్రం లక్ష్మీనగరం గ్రామంలోని ఓ గ్రామీణ వైద్యుడి దగ్గరకు చికిత్స కోసం వెళ్లింది. అక్కడ చికిత్స పొందుతుండగా ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారి, అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీంతో కుటుంబ సభ్యులు భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సరోజిని అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కాగా ఆర్‌ఎంపీ నిర్లక్ష్యం వల్లే సరోజిని మృతి చెందిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆర్‌ఎంపీపై దాడికి ప్రయత్నించారు. పెద్ద మనుషుల మధ్య వర్తిత్వంతో వివాదం సద్దుమణిగింది. మృతదేహాన్ని ఎంపీడీఓ ముత్యాలరావు, ఏపీఓ సుకన్య, పంచాయతీరాజ్ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది సందర్శించి, సంతాపం తెలిపారు.

### చికిత్స పొందుతున్న లారీ డ్రైవర్..

**పాల్వంచరూరల్:** లారీ డ్రైవర్ ఆత్మహత్య ఘటనపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని నాగారం కాలనీకి చెందిన లారీ డ్రైవర్ భూక్యా నవీన్(22)కు నాలుగు నెలల క్రితం పూజితతో వివాహం జరిగింది. భార్యను వారం రోజుల క్రితం పుట్టింట్లో దింపి వచ్చాడు. ఆ తర్వాత కుటుంబంలో గొడవల కారణంగా ఈ నెల 18న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం పాల్వంచ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడని మృతుని భార్య పూజిత పోలీసులకు గురువారం ఫిర్యాదుచేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కార్తీక్ తెలిపారు.

### మానసిక దివ్యాంగుడు..



రతన్ (ఫైల్)

**టేకులపల్లి:** మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన మానసిక దివ్యాంగుడు గురువారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన మాళోతు శంకర్, పద్మ దంపతుల కుమారుడు రతన్(25) మానసిక దివ్యాంగుడు. తరుచూ ఫిట్స్ రావడం, కిడ్నీ సమస్య, బ్రెయిన్ సమస్యతో బాధపడుతున్నాడు. కాగా నాలుగు రోజుల క్రితం జ్వరం రావడంతో ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

### పిడుగుపాటుతో మూడు ఆవులు మృత్యువాత



మృతి చెందిన ఆవులు

**పాల్వంచరూరల్:** మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి గ్రామపంచాయతీ గుండ్లమడుగు గ్రామానికి చెందిన చింత నారాయణ, వెంకటమ్మలు తమ పంట చేను దగ్గర మూడు ఆవులను కట్టివేశారు. గురువారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పిడుగుపాటుతో మూడు ఆవులు మృతి చెందాయి. రూ.70 వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

## క్లుప్తంగా

### అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న విప్ కాంతారావు

**మణుగూరు రూరల్:** పినపాక నియోజకవర్గంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు సూచించారు. గురువారం ఐటీడీఏ అధికారులతో స్థానిక క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐటీడీఏ ఈఈ తానాజీ, డీఈ రాములు, ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రత్యేక చట్టం తేవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

**చర్ల:** ఆర్టికల్ 244 (1), (2) ప్రకారం షెడ్యూల్డ్ ఏరియాలో స్థానిక గిరిజనులకే ఉద్యోగాలు ఇవ్వాలనే చట్టం తేవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పూనెం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 3కు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏటీపీ, ఏవీఎస్‌పీ, ఏయూఎస్‌పీ సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని సుబ్బంపేట సమీపంలో ఉన్న ఎదిరగుట్టల నుంచి భద్రాచలం వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ డీఎస్సీ ప్రకటించాలని కోరారు. గిరిజనులు ఏ రాష్ట్రానికి వెళ్లినా ఎస్టీ కులధ్రువపత్రాలు జారీ చేయాలని, ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణకు వలస వచ్చిన ఆదివాసీలకు కూడా ఎస్టీ కుల ధ్రువ పత్రాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏవీఎస్‌పీ, ఏఎస్‌పీ, ఏయూఎస్‌పీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### వార్షిక లక్ష్యం సాధించాలి

సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి



బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

**మణుగూరు టౌన్:** సింగరేణి మణుగూరు ఏరియా 2023–24 వార్షిక లక్ష్యమైన 119.50 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించాలని డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) వెంకటేశ్వరరెడ్డి సూచించారు. గురువారం ఆయన కొండాపురం గని కంటిన్యూయస్ మైనర్ యంత్రం ద్వారా బొగ్గు ఉత్పత్తి ప్రకియపై అధికారులతో చర్చించారు. పీకేఓసీ–2 వ్యూ పాయింట్ నుంచి క్వారీలో జరిగే లోడింగ్‌ను పరిశీలించారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏరియాలో నిర్దిష్టమైన ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. మ్యాన్ పవర్, యాంత్రిక శక్తిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం దుర్గం రామచందర్, అధికారులు లక్ష్మీపతిగౌడ్, వీరభద్రరావు, వీరభద్రుడు, బి.వెంకటేశ్వర్లు, మధుబాబు, చిట్టా శ్రీనివాస్, షబ్బీరుద్దీన్ తదితరులు ఉన్నారు.

### వర్షంతో మిర్చి పంటకు నష్టం



బోయితండాలో వరద ఉధృతికి పడిపోయిన మిర్చి మొక్కలు

**ఇల్లెందురూరల్:** మండలంలోని పలు గ్రామాల్లో గురువారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. ప్రస్తుతం ఏపుగా ఎదుగుతున్న మొక్కజొన్న, పత్తి పంటలకు వర్షం చాలా వరకు మేలు చేకూర్చగా, మిర్చి పంటకు మాత్రం తీరని నష్టం కలుగజేసింది. మిర్చి మొక్కలు, కొన్ని చోట్ల మొక్కజొన్న నేలవాలాయి. వరద ఉధృతితో పలు పంటలు నీట మునిగాయి. ఉధృతి అధికంగా ఉన్న చోట మొక్కలు కొట్టుకుపోయాయి. ఇప్పటికే తెగుళ్ల కారణంగా రెండు, మూడు సార్లు మిర్చి మొక్కలు నాటిన తమకు భారీ వర్షం మరింత నష్టాన్ని చేకూర్చిందని రైతులు వాపోతున్నారు.

### నేడు కొబ్బరి రైతుల సమావేశం

**అశ్వారావుపేటరూరల్:** కొబ్బరి అభివృద్ధి బోర్డు ఆధ్వర్యాన శుక్రవారం సదస్సు ఏర్పాటుచేసినట్లు రైతు సంఘం బాధ్యులు కొక్కెరపాటి పుల్లయ్య తెలిపారు. అశ్వారావుపేట నుంచి గంగారం వెళ్లే మార్గంలోని రాజు కొబ్బరి తోటలో ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కొబ్బరి సాగులో శాస్త్రీయ పద్ధతులు, ఇతర అంశాలపై బోర్డు బాధ్యులు, శాస్త్రవేత్తలు వివరించనున్నందున రైతులు హాజరుకావాలని ఆయన కోరారు.